# ప్రభుత్వ ఆదాయానికి గండి

- నిబంధనలకు విరుద్ధంగా రహదారుల వెంబడి హోర్డింగ్‌ల ఏర్పాటు
- ప్రమాదాలపాలవుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు




వాకాడ సమీపంలో ప్రమాదకర మలుపు వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు



పెదకొత్తూరు వద్ద ఉన్న ప్రకటనల బోర్డు

**కరప:** పట్టణాలకే పరిమితమైన హోర్డింగ్స్ (ప్రకటన బోర్డులు) ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాయి. వ్యాపార, విద్యా సంస్థలు తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులపైన, అమ్మకాలపైన ప్రచారం చేసేందుకు గ్రామీణ రహదారుల వెంబడి, గ్రామాల్లోనూ ఈ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలను ఆకర్షించేలా భారీ సైజులో రోడ్డు పక్కన హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికుల, పాదచారుల దృష్టి వాటిపై మళ్లి ప్రమాదాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వివిధ వ్యాపార సంస్థలు, వ్యాపారస్తులు హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం, వీటికి అద్దె చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా గ్రామ పంచాయతీలు తమకు వచ్చే ఆదాయాలను కోల్పోవాల్సి వస్తోంది. రోడ్ల వెంబడి ప్రధాన సెంటర్లలోనూ, గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలకు, భవనాలపైన వీటిని ఏర్పాటు చేస్తున్నారు. భారీ సైజులో వీటిని ఏర్పాటు చేయడంతో ఎప్పుడు మీద పడతాయోనని ప్రజలు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారు. బోర్డుల ఏర్పాటుకు భవన యజమానులు, పంచాయతీ, విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. కానీ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు.

**ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో..**

కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో కరప మండలంలో 23 గ్రామాలు, కాకినాడ రూరల్ మండలంలో 18 గ్రామాలు, అర్బన్‌లో ఆరు డివిజన్‌లో ఉన్నాయి. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచేలా చేస్తామంటున్నారే కానీ ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీరాజ్ మినిస్టర్ పవన్ కల్యాణ్ జీతం తీసుకోకుండానే పని చేస్తానంటున్నారు బాగానే ఉంది. అధికార పార్టీల నాయకులు గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలపై ట్యాక్స్ వసూలు చేసేలా చర్యలు తీసుకుంటే గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తుంది కదా అని ప్రజలు అంటున్నారు. పెరిగిన రేట్ల ప్రకారం హోర్డింగులపై ట్యాక్స్ వేస్తే ఒక్కొక్క పంచాయతీకి కనీసం రూ.30 నుంచి 40 వేలు వరకు ఆదాయం రావచ్చని అధికారులు అంటున్నారు.

**ఎక్కడికక్కడే..**

కరప మండలంలోని పలు గ్రామాల మీదుగా ఉన్న కాకినాడ–రావులపాలెం, కాకినాడ–కోటిపల్లి రహదారుల వెంబడి రోడ్లకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడికక్కడే అనధికార హోర్డింగ్‌లు భారీ ఎత్తున వెలిశాయి. కాకినాడ పట్టణానికి చెందిన పలు వ్యాపార సంస్థలతో పాటు మండల గ్రామాలకు చెందిన వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు ప్రధాన రహదారుల వెంబడి ఈ అనధికార హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. పలువురు స్థానికులు పలు రకాల స్లోగన్స్ వివరిస్తూ, సినీనటులకు, రాజకీయ నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, వివిధ వ్యాపార, విద్యా సంస్థలు, ఆసుపత్రులు స్వచ్ఛందంగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ పరిధిలో హోర్డింగ్‌లకు సైజులను బట్టి కనీసం రూ.100 నుంచి రూ. 800 వరకూ పంచాయతీలకు అద్దె చెల్లించాల్సి ఉంది. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసే చిన్న చిన్న ప్రకటన బోర్డులకు రూ. 50 నుంచి రూ.100 వరకూ ట్రాన్స్‌కోకు చెల్లించాల్సి ఉంది. ఈ ప్రచార హోర్డింగ్‌ల ద్వారా పంచాయతీలకు ఏటా వేలాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారులు వీటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



విద్యుత్ స్తంభంపై ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డు

**ప్రమాదాలకు కారణం**

రోడ్లపై ప్రత్యేక ఆకర్షణలతో ఏర్పాటు చేసే ప్రకటన బోర్డులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వ్యాపారులు ప్రధాన మలుపుల్లోను, కూడళ్లల్లో ప్రధాన సెంటర్లలోనే ఈ ప్రచార బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ఈ బోర్డులను పరిశీలిస్తూ ఎదురుగా వచ్చే వాహనాలను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మార్జిన్లలో హోర్డింగులు ఏర్పాటు చేయడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునేందుకు పక్కకు వెళ్లేందుకు చోటు లేక ప్రమాదాలు జరుగుతున్నట్టు వాహనచోదకులు అంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ప్రమాదభరితంగా ఏర్పాటు చేస్తున్న ఈ హోర్డింగ్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లోను, రహదారుల పక్కన నిబంధనలకు అనుగుణంగా హోర్డింగుల ఏర్పాటు చేసికోవాలి. ప్రకటన బోర్డుల సైజును బట్టి పంచాయతీకి ట్యాక్స్ చెల్లించాలి. గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన వ్యాపార సంస్థలకు పంచాయతీల ద్వారా నోటీసులు జారీ చేసి, ఆదాయ వనరులు పెంచుకునేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్‌వీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీఓ, కరప మండలం

### ఆదాయం పెంచేలా చూస్తాం



గ్రామ పరిధిలో పంచాయతీ అనుమతి లేకుండా వ్యాపార సంస్థలు ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశారు. అధికారులతో చర్చించి, పంచాయతీకి ఆదాయం వచ్చేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. పంచాయతీ ఆదాయం పెంచే పనులు చేస్తాం. అనధికారంగా బోర్డులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు.

– సాదే ఆశాజ్యోతి, సర్పంచ్, కరప

## క్లుప్తంగా

### విద్యతోనే ప్రగతి



విద్య ఆవశ్యకతను వివరిస్తున్న జిల్లా బాలల సంక్షేమ అధికారి వెంకట్రావు

**కాకినాడ రూరల్:** విద్యతోనే రాష్ట్ర ప్రగతి ముడిపడి ఉందని బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 6–14 మధ్య వయస్సు పిల్లలు కచ్చితంగా బడిలో ఉండాలన్నారు. ఒకవేళ పిల్లలు మధ్యలో బడి మానివేస్తే వారిని తిరిగి పాఠశాలలో చేర్పాలన్నారు. సంచార జాతుల పిల్లలను గుర్తించి వారిని దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పిస్తున్నట్టు వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఎంఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్

**బాలాజీచెరువు:** జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా వైజాగ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఖోఖో చాంపియన్ షిప్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించి క్రీడాశాఖ నుంచి ఒక లక్ష రుపాయలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులు దొమ నందిని, అనంతలక్ష్మీను శనివారం కళాశాల కరస్పాండెంట్ లక్ష్మీతులసి, డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్, ఫిజికల్ ట్రైనర్ వేణుగోపాల్ అభినందించారు.

### పంచారామ క్షేత్రంలో గణపతికి ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలో పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడు

**సామర్లకోట:** స్థానిక పంచారామ క్షేత్రంలో ఉన్న గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సాయంత్రం లక్ష్మీగణపతి హోమం, పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారికి వెండి ఆభరణాల అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, అక్లకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, వేమూరి చంటి, సన్నిధిరాజు భాస్కర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకుంటున్న జగ్గంపేట విద్యార్థి యశ్విన్

**జగ్గంపేట:** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జగ్గంపేట విద్యార్థి బంగారు పతకం సాధించాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 29 తేదిన పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జగ్గంపేటకు చెందిన విద్యార్థి యం.యశ్విన్ 93 కేజీల విభాగంలో విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించినట్లు కోచ్ బి.కన్నారావు తెలిపారు. అలాగే ఎం.రేవంత్, మద్దాల సృజన్ 66 కేజీల విభాగంలో ప్రతిభ చూపి నాలుగో స్థానంలో నిలిచారన్నారు. బంగారు పతకం సాధించిన యశ్విన్‌ను స్థానిక నేతలు, కోచ్ కన్నారావు అభినందించారు.

**క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ**

**తొండంగి:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ పీఆర్ కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వీకే మెహర్ శనివారం తెలిపారు.

## కరప ఎంపీడీఓకు డీఎల్‌డీఓగా పదోన్నతి

**కరప:** మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న మట్టపర్తి అనుపమకు డీఎల్‌డీఓగా పదోన్నతి లభించింది. ఈమేరకు పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని, పోస్టింగ్ ఎక్కడనేది తెలిసేందుకు రెండు, మూడు నెలలు పట్ట వచ్చని ఎంపీడీఓ శనివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓగా పదోన్నతి పొందిన ఎంపీడీఓ అనుపమను పలువురు నాయకులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయం, ఉపాధి పథకం సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, వజ్రపు కామేశ్వరరావు, ఏఓ బీఎల్ నరసింహం, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏపీఓ ఆర్.ప్రభాకరరావు, జేఈ సంగీతలక్ష్మి, టి.సుబ్రహ్మణ్యం, రామలక్ష్మి, కార్తీక్, ఎం.గోపి, భాస్కర్, కార్యదర్శులు పీఎస్ఆర్ బ్రహ్మానందం, పి.వీరభద్రరావు, దుర్గాప్రసాద్, పి.ఉమామహేశ్వరి తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.



డీఎల్‌డీఓగా పదోన్నతి పొందిన ఎంపీడీఓ అనుపమను అభినందిస్తున్న నాయకులు

## పవర్ లిఫ్టింగ్ విజేతలకు అభినందనలు



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాధించిన పతకాలతో గొర్రిపూడి యువకులు

**కరప:** బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా శుక్రవారం కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరీస్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ (మెన్ అండ్ ఉమెన్) పోటీల్లో కరప మండలం గొర్రిపూడి యువకులు సత్తా చాటి, గోల్డ్, సిల్వర్, బ్రాంజి మెడల్స్ గెలుచుకున్నారు. జి.సాయిమణికంఠ పవర్ లిఫ్టింగ్ పోటీలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్, బెంచి ప్రెస్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించాడు. పి.వీరేంద్ర పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్, వై.మహేష్ పవర్‌లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్, పి.మణికంఠ పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్, బెంచ్‌ప్రెస్‌లో బ్రాంజ్ మెడల్ గెలిచారు. పవర్ లిఫ్టింగ్ పోటీలలో సత్తాచాటిన యువకులను, కోచ్ జగన్‌లకు శనివారం కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, గ్రామసర్పంచ్ కె.రమాదేవి, కరప మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వం చేయలేని సేవలు రోటరీ చేస్తోంది



విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రోటరీ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి

**బోట్‌క్లబ్:** ప్రభుత్వం చేయలేని సేవలు కూడా రోటరీక్లబ్ చేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో శనివారం రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్, రోటరీ క్లబ్‌ల సంయుక్త సమావేశం నిర్వహించారు. రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు రూ.30 లక్షలు విలువ చేసే సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్స్, రూ.15 లక్షలు విలువ చేసే 60 కుట్టుమెషీన్లు, రూ.15 లక్షలు విలువ చేసే క్రీడాపరికరాలను శనివారం రోటరీ గవర్నర్ వై.కల్యాణ్‌చక్రవర్తి ఆధ్వర్యంలో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోటరీ బ్లడ్‌బ్యాంకు ద్వారా ఎన్నో జీవితాలు బాగుపడ్డాయన్నారు. రోటరీ ఆధ్వర్యంలో ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేయాలని, అవసరమైన ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. ప్రజా సేవ చేయాలంటే రాజకీయాల్లోకి రావాల్సి అవసరం లేదని రోటరీ సభ్యత్వం ఉంటే సరిపోతుందన్నారు. రోటరీ జిల్లా గవర్నర్ వై.కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీక్లబ్ అధ్యక్షులు తడల బుజ్జి, గోల్డెన్‌జూబ్లీక్లబ్ అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఎంతో అద్భుతంగా చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను వేసేందుకు అనుమతులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ గోడే సత్య, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సురభి శారద , కృష్ణకుమారి, సభ్యులు నామన రమేష్, తడాల వరప్రసాద్, చోడవరపు మూర్తి పాల్గొన్నారు.

## విద్యార్థులు భాషపై అవగాహన పెంచుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీవీపీ ప్రతినిధులు

**తుని:** విద్యార్థులు భాషపై అవగాహన పెంచుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు సూచించారు. స్థానిక మర్చంట్ అసోసియేషన్ భవనంలో శనివారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జాతయ బృందగాన పోటీలు నిర్వహించారు. సంస్కృతం, హిందీ విభాగాల్లో తుని, పాయకరావుపేట శ్రీప్రకాష్‌కు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరికి కలిదిండి సత్యనారాయణరాజు, ఎంవీఎస్ రాజు బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతులుగా అమీనా సాహెబ్, సత్యవేణి వ్యవహరించారు. బీవీపీ అధ్యక్షుడు వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్‌తో వందశాతం ఉత్తీర్ణత

**బోట్‌క్లబ్:** ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా నగరంలో నూరు శాతం అక్షరాస్యత సాధించడం లక్ష్యమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అభిప్రాయపడ్డారు. శనివారం స్మార్ట్ సిటీ మీటింగ్ హాల్‌లో 463 మంది వాలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వీరు మొదటి విడతలో ఎంపికైన 4,634 మంది నిరక్షరాస్యులకు విద్య అందిస్తారన్నారు. వీరు నిరక్షరాస్యులకు విద్యను ఏ విధంగా బోధించాలో ఈ శిక్షణలో వలంటీర్లకు మెలకువలు అందించినట్లు చెప్పారు. టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.శైలజ మాట్లాడుతూ నగరాన్ని నూరు శాతం అక్షరాస్యుల నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ లక్ష్యం సాధనలో వలంటీర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. వయోజన విద్యా శాఖ ప్రతినిధి రాజేష్ మాట్లాడుతూ ప్రతి వలంటీర్ సాయంత్రం 5 నుంచి 7 గంటల మధ్య వయోజనులకు చదువు బోధించాలిఅని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆస్తి పన్నుల వసూలుపై దృష్టి

**బోట్‌క్లబ్:** రాష్ట్రంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఆస్తి పన్నుల వసూలు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్లకు రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఆదేశించారు. తాడిపల్లి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆస్తి పన్ను, నీటి పన్నుల వసూళ్లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, జనగణన కోసం వార్డు సరిహద్దుల ఖరారు, వీధి కుక్కల నియంత్రణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, దోమల నివారణ కోసం డ్రోన్ల వినియోగం తదితర అంశాలపై శనివారం సమీక్షించారు. ప్రభుత్వ కార్యాలయాలపై బకాయిల వసూలుకు కమిషనర్లు స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి సంబంధిత అధికారులతో చర్చించాలన్నారు. మొండి బకాయిల వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పన్నులను వసూలు చేయాలన్నారు. క్యాంప్ కార్యాలయం నుంచి నగరపాలక సంస్థ కమిషనర్ భావన, కార్పొరేషన్ కార్యాలయం నుంచి అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అధికారుల ఆదేశాలు బేఖాతరు

మళ్లీ దేవస్థానం భూమి ఆక్రమణ

**కరప:** పెనుగుదురులో దేవాదాయశాఖకు చెందిన సర్వే నంబరు 176/1లో 3.28 ఎకరాలు పంటభూమి ఉంది. ఈ భూమిని చొల్లంగి ఆలయ అర్చకునికి సర్వీసు ఈనాంగా కేటాయించారు. సదరు భూమిని పంట పండించుకోవడానికి రైతులకు లీజ్‌కు ఇస్తుంటారు. అర్చకుని వద్ద నుంచి ఒక రైతు లీజ్‌కున్న రైతు ఆ భూమిని మెరక చేయడానికి ప్రయత్నించగా దేవదాయశాఖాధికారులు, రెవెన్యూ అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకుని, దేవస్థానం భూమిలో వేసిన రోడ్డును పొక్లెయిన్‌తో తవ్వించి, హెచ్చరిక బోర్డులు పెట్టిన విషయం పాఠకులకు విదితమే. చొల్లంగి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సింగిల్ ట్రస్టీగా కాకినాడ బొగ్గవరపు సుబ్బారావు సత్రం ఈఓ జి.శివబాబును నియమించారు. కాగా దేవస్థానం భూమిని కౌలు రైతు మళ్లీ ఆక్రమించుకుని గ్రావెల్ రోడ్డును వేసేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఈఓ శివబాబు శనివారం సిబ్బందితో వచ్చి రోడ్డును తవ్వించేసి, దేవదాయశాఖకు చెందిన భూమిలో ఫెన్సింగ్ పనిని చేపట్టగా కొంతమంది వచ్చి ఈఓపై తిరగబడగా పోలీసుకేసు పెడతామని చెప్పడంతో వెళ్లిపోయారు. రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బందితో వచ్చి, సోమవారం తమభూమి చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తామని ఈఓ తెలిపారు.



పెనుగుదురులో దేవదాయ శాఖ భూమిలో ఫెన్సింగ్ వేయిస్తున్న ఈఓ శివబాబు

## కాశీ ఖండం తెలుగు అనువాదం అద్భుతం

**బోట్‌క్లబ్:** స్కాంద పురాణ అంతర్గతమైన సంస్కృత భాషలోని కాశీ ఖండాన్ని శ్రీనాథుడు తెలుగు లో అద్భుతంగా అనువాదించి మనల్ని పునీతుల్ని చేశారని సంస్కృతాంధ్ర పండితులు మద్దాలి సత్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో శనివారం గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మద్దాలి కాశీ ఖండం అద్భుత ఘట్టంపై ప్రసంగించారు. నర్మదా నది పరివాహక ప్రాంతాల పక్ష్తిని మహోన్నత వనాలను, మారేడు, మేడి చెట్లను శివుని స్థితిగతులతో సరిపోలుస్తూ శ్రీనాథుడు చేసిన వర్ణన ప్రఖ్యాతి గాంచిందని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్కృత ప్రచార సభ అధ్యక్షుడు జీవీకే వర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు ద్వారా భారతీయ తాత్త్వికత ప్రచారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత ప్రచార సభ ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామ చంద్ర మూర్తి, కోశాధికారి చింతపల్లి సుబ్బారావు, సభ్యులు డాక్టర్ ఆకెళ్ళ శ్రీరామ మూర్తి, భమిడి మూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంస్కృతాంధ్ర పండితుడు మద్దాలి సత్యనారాయణ

## కక్షిదారుల సౌలభ్యం కోసం ఈ-సేవ కేంద్రాలు

మూడో అదనపు జిల్లా జడ్జి ఆనంది

**కాకినాడ లీగల్:** కక్షిదారులు, న్యాయవాదుల సౌలభ్యం కోసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ–సేవ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి ఆనంది తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ–సేవ కేంద్రాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి ఆనంది మాట్లాడుతూ ఈ కేంద్రాల ద్వారా ఉచితంగా కక్షిదారులకు, న్యాయవాదులకు కేసుల పరిస్థితి, తదుపరి విచారణ తేదీలు వంటి వివరాలను తెలుపుతారని వివరించారు. సెలవులో ఉన్న న్యాయమూర్తుల వివరాలను కూడా తెలియజేస్తారని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. న్యాయపరమైన ఆదేశాలు, తీర్పులు, సాఫ్ట్ కాపీలను ఈ–మెయిల్, వాట్సాప్, అందుబాటులో ఉన్న ఇతర యాప్‌ల ద్వారా ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. న్యాయశాఖలో సిబ్బంది ఈ–సేవ కేంద్రాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



ఈ-సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి ఆనంది

### బీచ్‌లో విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు



సూర్యారావుపేట బీచ్ వద్ద వినాయక నిమజ్జనాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో సతీష్ తదితరులు

**కాకినాడ రూరల్:** గణేశ్ నవరాత్ర ఉత్సవాల అనంతరం మండపాల్లోని గణపతి ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు సాగరతీరం సూర్యారావుపేట బీచ్ వద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో నిమజ్జనాలు చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ సిటీ, రూరల్ పరిధిలోని విగ్రహాలు నిమజ్జనాల కోసం తీసుకురానుండడంతో బీచ్ వద్ద రోడ్డు నిర్మాణ పనులు, శానిటేషన్‌ను, క్యూలైన్ల ఏర్పాట్లను చేపట్టారు. శనివారం పనుల తీరును ఎంపీడీవో సతీష్, ఈవోపీఆర్డీ సీతారామాంజనేయులు తదితరులు పరిశీలించారు.